**Eenadu**

# నవంబరులో గ్రూప్-2!

**ఈనాడు, హైదరాబాద్:** ఉద్యోగార్థులంతా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న గ్రూప్-2 పరీక్ష నవంబరులో జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఒక ట్రెండు రోజుల్లో 500కుపైగా గ్రూప్-2 పోస్టులకు సంబంధించిన అనుబంధ ప్రకటనను విడుదల చేసేందుకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ కసరత్తు చేస్తున్నట్లు తెలిసింది. వీటితోపాటు 2444 గురుకుల పోస్టులకూ టీఎస్‌పీఎస్సీ ప్రకటన విడుదల చేస్తుంది. వీటిలో ప్రధానాచార్యులు, టీజీటీ, పీజీటీ, ఆర్ట్, క్రాఫ్ట్, బోధనేతర సిబ్బంది.. ఇలా 10 రకాల పోస్టులున్నట్లు సమాచారం. ఉపాధ్యాయ దినోత్సవం నాటికల్లా వీటి ప్రకటన వెలువడే అవకాశముంది. ఇవిగాక మరో 3వేల దాకా గురుకులాల పోస్టులు రావాల్సి ఉంది. దరఖాస్తుల దాఖలు లోపు ఆయా శాఖల నుంచి అవసరమైన సమాచారం వస్తే వాటికి కూడా అనుబంధ నోటిఫికేషన్ ఇస్తారు. అప్పుడు గురుకులాల్లో 5వేల పోస్టుల వరకు అవుతాయి. రాష్ట్రంలో అన్నిరకాల గురుకుల సొసైటీలు కలిసి ఒకే సర్వీస్ రూల్స్ రూపొందించుకొని వాటిని టీఎస్‌పీఎస్సీకి పంపించాయి. ప్రభుత్వం అన్నింటికీ పరీక్షలను నిర్వహించే బాధ్యతను టీఎస్‌పీఎస్సీకే అప్పగించింది. నిజానికి ఇలాంటి పోస్టుల భర్తీ కమిషన్‌కిదే తొలిసారి. మిగిలిన పోస్టులను విజయవంతంగా నిర్వహించిన నేపథ్యంలో ఈ పోస్టులను కూడా ముఖ్యమంత్రి కేసీఆర్ కమిషన్‌కు అప్పగించారు. ఇక గ్రూప్-2లో ఇప్పటికే 439 పోస్టులకు ప్రకటన ఇవ్వడం, వాటికి 6 లక్షల దాకా దరఖాస్తులు అందడం, అభ్యర్థుల కోరిక మేరకు పరీక్షను వాయిదా వేయడం తెలిసిందే. ఇప్పుడా 439 పోస్టులు కలిపి మొత్తం 1000కిపైగా గ్రూప్-2 పోస్టులకు టీఎస్‌పీఎస్సీ పరీక్ష నిర్వహిస్తుంది. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్నవారు కూడా కొత్తగా ప్రకటించే పోస్టులకు అర్హులవుతారు. అంటే కొత్తగా మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం ఉండదు. తాజా అనుబంధ నోటిఫికేషన్ తర్వాత మరో 1-2లక్షల మంది కొత్తగా దరఖాస్తు చేసుకుంటారని భావిస్తున్నారు. జోనల్ వ్యవస్థను రద్దు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినా గ్రూప్-2 నియామకాలపై ఆ ప్రభావం ఉండట్లేదు. ఎందుకంటే ఇప్పటికే ఇచ్చిన నోటిఫికేషన్‌ను పాత నిబంధనల మేరకే చేయాల్సి ఉంటుంది. అనుబంధ నోటిఫికేషన్‌కూ ఇదే వర్తిస్తుంది. ప్రభుత్వం ఒకవేళ ఏవైనా సూచనలిస్తే గ్రూప్-2 షెడ్యూలులో మార్పులు జరగవచ్చు లేదా వాయిదా అయినా పడే అవకాశం ఉంది.